ఉప ఎన్నిక నిర్వహణకు ఏర్పాట్లు

- 13 నుంచి నామినేషన్‌ల స్వీకరణ
- అభ్యర్థితో పాటు నలుగురికి మాత్రమే అనుమతి
- నామినేషన్ పత్రాల కోసం రెండు హెల్ప్‌డెస్క్‌లు
- ఎన్నికల ఖర్చుపై నిఘా ఉంచేందుకు ప్రత్యేక బృందాలు

బంజారాహిల్స్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నిర్వహణ కోసం చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. నామినేషన్‌ల స్వీకరణ, ఇతర కార్యకలాపాలు నిర్వహించేందుకు షేక్‌పేట రెవెన్యూ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణ కేంద్రం సిద్ధమైంది. విధుల్లో పాల్గొంటున్న సిబ్బందికి గుర్తింపుకార్డులను జారీ చేస్తున్నారు. ఇప్పటికే వీరందరికీ శిక్షణ పూర్తయింది. నామినేషన్ కేంద్రం వద్ద బందోబస్తు ఏర్పాట్లపై బంజారాహిల్స్ పోలీసులు కసరత్తు చేస్తున్నారు. నామినేషన్ కేంద్రానికి దారితీసే రహదారుల్లో పికెటింగ్ ఏర్పాటు, పోలీసు బందోబస్తు, తనిఖీలు తదితర అంశాలపై రిటర్నింగ్ అధికారితో సమీక్ష నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే రూట్‌మ్యాప్ సిద్ధం చేశారు. ఉప ఎన్నిక పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు రిటర్నింగ్ అధికారి పి. సాయిరాం తెలిపారు. నామినేషన్ వేసే అభ్యర్థులు నిబంధనలను తప్పకుండా పాటించాలని సూచించారు.



జూబ్లీహిల్స్ ఎన్నికల కార్యాలయంగా షేక్‌పేట మండల కార్యాలయం

నామినేషన్ దాఖలు ఇలా..

ఈనెల 13న ఉదయం 11 గంటలకు నామినేషన్‌ల ప్రక్రియ మొదలవుతుంది. ఈనెల 21 వరకు ప్రతీ రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్‌లను స్వీకరిస్తారు. దీపావళి నేపథ్యంలో 19, 20న సెలవు. నామినేషన్ పత్రాల కోసం మండల కార్యాలయంలో రెండు హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశారు. ఇక్కడ సిబ్బంది కావాల్సిన సహాయం చేస్తారు. నామినేషన్ సెట్‌లో 2బీ ఫాం, 26 అఫిడవిట్‌తో పాటు నిబంధనల పుస్తకం, చెక్ లిస్టును అందజేస్తారు. ఏ నియోజకవర్గానికి చెందిన వారైనా నామినేషన్ వేయడానికి అర్హులు. కానీ, ప్రతిపాదించే వారు నియోజకవర్గ ఓటర్లై ఉండాలి. జాతీయ, ప్రాంతీయ పార్టీలకు చెందిన వారికి ఒక్కరు ప్రతిపాదిస్తే సరిపోతుంది. మిగతా వారు కనీసం పది మంది ప్రతిపాదనలతో నామినేషన్ పత్రాలను జతపర్చాల్సి ఉంటుంది. నామినేషన్ వేసే వారు తప్పనిసరిగా ఓటరు లిస్టులో పేరును సూచిస్తూ పోలింగ్ స్టేషన్ లేదా జీహెచ్‌ఎంసీ కార్యాలయం నుంచి ఎలక్ట్రాల్ క్లీయరెన్స్ తీసుకోవాల్సి ఉంటుంది. ఈసారి కొత్తగా కలర్‌ఫొటోను పెట్టాలనే నిబంధనను ఎన్నికల కమిషన్ విధించింది. దీనిని తప్పకుండా పాటించాలి. నామినేషన్ దరావత్తు సాదారణ వారికి రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.5 వేలు. జాతీయ, ప్రాంతీయ పార్టీలు ఈనెల 21లోగా ఏ, బీ ఫారాలు అందజేయాల్సి ఉంటుంది. రిటర్నింగ్ అధికారి కాకుండా ఐదుగురు నోడల్ అధికారులు, అనేక మంది సిబ్బంది సేవలందిస్తారు.

ఐదుగురికి మాత్రమే అనుమతి..

నామినేషన్ వేసే వారి మూడు కార్లను మాత్రమే వంద మీటర్ల వరకు అనుమతిస్తారు. కార్యాలయంలోకి అభ్యర్థితో పాటు నలుగురు మాత్రమే రావాల్సి ఉంటుంది. ఎటువంటి నినాదాలు, జెండాలు అనుమతించబడవు. నామినేషన్ ర్యాలీ, ఎన్నికల ప్రచారంలో చేస్తున్న ఖర్చులపై ప్రత్యేక బృందాలు నిఘా పెడతాయి. అభ్యర్థులు రూ. 40 లక్షలలోపు మాత్రమే ఖర్చు చేయాల్సి ఉంటుంది. ప్రతీ రోజు వారికి ఇచ్చిన పుస్తకంలో ఖర్చులు నమోదు చేయాల్సి ఉంటుంది. పరిశీలకుల జాబితాకు అభ్యర్థులు ఇచ్చిన ఖర్చులకు లెక్క సరిపోల్చుకుంటూ ఉండాలి. 11 ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, 15 స్టాటిక్ సర్వేబృందం, 100 మంది నిఘా సిబ్బంది ఖర్చులపై దృష్టి పెడతారు. జీహెచ్‌ఎంసీ సిబ్బంది కూడా పర్యవేక్షిస్తుంటారు.

సువిధ పోర్టల్ ద్వారానే అనుమతులు

ఎన్నికల్లో ప్రచారాలు చేయాలనుకునే వారు సువిధ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకుంటే పోలీసు శాఖ, రిటర్నింగ్ అధికారి పరిశీలించి అనుమతులు జారీ చేస్తారు. రెండు రోజులు ముందుగానే దరఖాస్తు చేసుకునే అవకాశం పోర్టల్‌లో ఉంది. అలాగే, ఎన్నికల పరివర్తన నియమావళిని ఉల్లంఘించినట్టు అనుమానాలు ఉంటే సీవీ టీవీలో ఫిర్యాదు చేయవచ్చు. ఈ పోర్టల్‌ను ఎన్నికల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తుంటారు. ఇందుకోసం ఇద్దరు పరిశీలకులను ప్రత్యేకంగా నియమించారు.

నామినేషన్ వేసే వారికి సహకారం



నామినేషన్ వేసే అభ్యర్థులకు అన్ని రకాల సహాయ, సహకారాలు అందించేందుకు గతంలో ఎన్నికల విధులు నిర్వహించిన ఉద్యోగులను అందుబాటులో ఉంచాం. నామినేషన్ పత్రాలు కొనుగోలు చేశాక ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశం పై హెల్ప్‌డెస్క్ సహకరిస్తుంది. ఎలక్ట్రోల్ క్లియరెన్స్ మాత్రం జీహెచ్‌ఎంసీ నుంచి అభ్యర్థులు తెచ్చుకోవాల్సి ఉంటుంది. హెల్ప్‌డెస్క్‌లో ఎలాంటి జాబితాలు ఉండవు. నామినేషన్ వేసేందుకు వచ్చే వారు నిబంధనలను పాటించాలి. నిబంధనలను అధిగమించే వారిపై నిఘా ఉంటుందన్న విషయం మరవద్దు.

● పి.సాయిరాం, రిటర్నింగ్ అధికారి

జూబ్లీహిల్స్‌లో గులాబీ జెండా ఎగరడం ఖాయం

● ఎమ్మెల్సీ రవీందర్‌రావు


ఎస్పీఆర్ హిల్స్ టి.అంజయ్య నగర్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు


శ్రీరామ్ నగర్‌లో పాదయాత్ర చేస్తున్న దాస్యం వినయ్‌భాస్కర్

బోరబండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు తెలిపారు. రహ్మత్ నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీతగోపీనాథ్ తరపున శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నదని విమర్శించారు. ఇంటింటికీ తిరిగి 'కాంగ్రెస్ బాకీ కార్డులు' పంపిణీ చేశారు. మహిళలు, వయోధికులు, దివ్యాంగులకు ఇస్తామన్న పింఛన్లు ఇవ్వడం లేదని, రైతు భరోసా, రుణమాఫీ, ఉద్యోగ కల్పన, విద్యార్థినులకు స్కూటీ ఇవ్వకుండా మభ్యపెడుతున్నదని దుయ్యబట్టారు.

శ్రీరామ్‌నగర్‌లో...

శ్రీరామ్‌నగర్ బస్తీలో ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత తరపున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోసకారి కాంగ్రెస్ సర్కార్‌కు తగిన బుద్ధి చెప్పాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల సమయంలో 6 గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, 22 నెలలు అయినా ఏ ఒక్క గ్యారెంటీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. కేసీఆర్ 10 ఏళ్లలో తెలంగాణ, హైదరాబాద్‌ను అభివృద్ధిలో దేశంలోనే అగ్రభాగన నిలిపారని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎం.డి.మసూద్, ఎం.డి.నయీం, ఎం.డి.లియాఖత్ అలీ, కె.నరసింహారెడ్డి, ధనుజ, రఘు, ఉదయ్ కిరణ్ పాల్గొన్నారు.

'వడ్డెర కులాన్ని విస్మరిస్తున్న రాజకీయ పార్టీలు'

ఎర్రగడ్డ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వడ్డెర కులాన్ని రాజకీయ పార్టీలు విస్మరిస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం అణగదొక్కడానికి ప్రయత్నిస్తోందని వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు ఎం.నారాయణస్వామి ఆరోపించారు. శుక్రవారం ఎర్రగడ్డలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రాజకీయ పార్టీలు వడ్డెర కులాన్ని బానిసలుగా మాత్రమే చూస్తున్నాయని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు మాత్రమే 1989లో వడ్డెర కులాన్ని గుర్తించి ఖైరతాబాద్ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి న్యాయం చేశారని, ఓటమి అనంతరం కూడా యాదగిరిగుట్ట చైర్మన్ హోదా ఇచ్చి వడ్డెర కులానికి గౌరవం కల్పించారని తెలిపారు. తదుపరి ఏ పార్టీ కూడా వడ్డెర కులానికి సరైన ప్రాతినిధ్యం ఇవ్వలేదని ఆరోపించారు. సమావేశంలో దేరంగుల రామచంద్రారావు, రాష్ట్ర కార్యదర్శి వేముల నరసింహ, నాయకులు శివరాత్రి అయిలమల్లు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

బోరబండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): షార్ట్‌సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. బోరబండ డివిజన్ బంజారానగర్‌లోని రాపర్తి రాందాస్ గౌడ్ ఇంట్లో శుక్రవారం షార్ట్‌సర్క్యూట్ జరిగింది. దీంతో ఇంట్లోని గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. విషయం తెలిసిన వెంటనే బోరబండ కార్పొరేటర్ ఎం.డి. బాబా ఫసియుద్దీన్ అగ్నిమాపక సిబ్బంది, పోలీసు సిబ్బందితో కలిసి మంటలను ఆర్పారు. రాందాస్‌గౌడ్‌కు ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మహేష్ కాసుల, రజాక్, నవీన్‌గౌడ్, శంకర్, మహేందర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపీ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11కేవీ జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్.86 ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

రౌడీషీటర్లకు పోలీసుల హెచ్చరిక

ఖైరతాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పండుగలు, ఉప ఎన్నిక నేపథ్యంలో ఖైరతాబాద్ పోలీసులు తమ పరిధిలోని రౌడీషీటర్లను పిలిపించి హెచ్చరించారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, గొడవలకు దిగినా కఠిన చర్యలుంటాయని ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం వారికి పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలింగ్ ఇచ్చారు.

ఎస్ఐ బదిలీ

ఖైరతాబాద్ ఎస్ఐ నాగరాజు కామాటిపుర పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈయన శుక్రవారం రిలీవ్ కాగా, కామాటిపుర నుంచి ఖైరతాబాద్‌కు బదిలీ అయిన ఎస్ఐ జమాల్ బాధ్యతలు స్వీకరించారు.

మాగంటి గోపీనాథ్ పేరు నిలబెడదాం

● బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత


వెంకటగిరిలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్


ఎన్నికల ప్రచారంలో బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు సంజీవ తదితరులు

యూసుఫ్‌గూడ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పేరు నిలబెడుదామని బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత పిలుపునిచ్చారు. కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్, మాగంటి అక్షరతో కలిసి ఆమె శుక్రవారం వెంకటగిరిలోని మహ్మదీయ మజీద్ వద్ద నమాజ్ అనంతరం ముస్లింలను ఆత్మీయంగా పలకరించి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి గెలిపించండి, గోపీనాథ్‌లాగే అండగా ఉంటానని అన్నారు. మసీదు పరిసర ప్రాంతాల్లోని వ్యాపారులను, ప్రజలను ఆత్మీయంగా పలకరించి ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్‌లు వాసుదేవారెడ్డి, దూదిమెట్ల బాలరాజు యాదవ్, నాయకులు శుభప్రద్ పటేల్, సతీష్‌రెడ్డి, రమేష్, ఆజం అలీ, డివిజన్ నాయకులు నీలం సంతోష్, నర్సింగ్ దాస్ పాల్గొన్నారు.

ఎర్రగడ్డలో ప్రచారం

ఎర్రగడ్డ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి నేతృత్వంలో ఎర్రగడ్డ డివిజన్‌లోని పలు బస్తీల్లో బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం ప్రచారం ప్రారంభించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంచి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీతను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మహేశ్వరి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ చేసిన అభివృద్ధిని చూసి ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షుడు డి.సంజీవ, నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, కంచర్ల పల్లవి యాదవ్, సయ్యద్ రసూల్, మహ్మద్ అజీముద్దీన్, కళ్యాణి పాల్గొన్నారు.

లంబాడీలు, ఆదివాసీల వివాదాన్ని పరిష్కరించాలి

పంజాగుట్ట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని లంబాడీలు, ఆదివాసీల మధ్య జరుగుతున్న వివాదంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని వెంటనే పరిష్కరించాలని సేవాలాల్ బంజారా సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్ర మోతీలాల్ నాయక్ డిమాండ్ చేశారు. లంబాడీలను, ముఖ్యంగా మహిళలను కించపరుస్తూ యావత్ జాతిని అవమానించేలా వాఖ్యలు చేస్తున్న తుడుం దెబ్బ అధ్యక్షుడు డా.మైపతి అరుణ్ కుమార్ పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేష్ నాయక్, ఉపాధ్యక్షుడు నగేష్ నాయక్, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి సరితాబాయి, తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. ఐదారు నెలలుగా రాజకీయ లబ్ధి కోసం కొంతమంది నాయకులు లంబాడీ, ఆదివాసీల మధ్య చిచ్చుపెడుతున్నారని ఆరోపించారు. తమ సామాజిక వర్గాన్ని ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని మాజీ ఎంపీ సోయం బాబూరావు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్‌రావు, తదితరులు ప్రయతిస్తున్నారని, తెర వెనక ఉండి వారితో సుప్రీంకోర్టులో కేసులు వేయిస్తూ మంత్రి సీతక్క కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. మంత్రి సీతక్క ఆదివాసీలకు నాయకత్వం వహించాలని అనుకుంటే మంత్రి పదవికి, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి ఉద్యమించాలని డిమాండ్ చేశారు. వివాదానికి కారకులను కాంగ్రెస్ అధిష్ఠానం సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు సంపత్ రాథోడ్, సాయి బాయి, పద్మబాయి తదితరులు పాల్గొన్నారు.

కుంగిన క్యాచ్‌ఫీట్లు.. డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు

శ్రీనివాస నగర్‌లో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు


ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పాత నివాసం ఎదుట కుంగిన డ్రైనేజీ మాన్‌హోల్


శ్రీనివాసనగర్‌లో కుంగిన క్యాచ్‌ఫీట్

ఖైరతాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై వర్షంనీరు వెళ్లే క్యాచ్‌ఫీట్లు, డ్రైనేజీల పై కప్పులు కుంగిపోయి నెలలు గడుస్తున్నా వాటిని బాగుచేయకపోవడంతో రాకపోకలు సాగించేందుకు స్థానికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతోన్నాయి. ఖైరతాబాద్ శ్రీనివాసనగర్ రహదారిలో ఈ సమస్య అధికంగా ఉంది. ఖైరతాబాద్ వాసులు ప్రతి రోజూ బస్సులు, మెట్రో, ఎంఎంటీఎస్‌ల ద్వారా ప్రయాణించేందుకు శ్రీనివాసనగర్ మీదుగా పాత కల్లు కాంపౌండ్ ఎదుట నుంచి వెళ్తుంటారు. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే రహదారిలో దాదాపు అన్ని క్యాచ్‌ఫీట్లు, డ్రైనేజీల మ్యాన్‌హోళ్లు కుంగిపోయాయి. రోడ్డుకు కిందకు ఉండడంతో కొన్ని చోట్ల స్థానికులు కర్రలను నాటి సూచికలు ఏర్పాటు చేశారు. వర్షాలు పడ్డ సమయంలో ఈ రహదారిలో నీరు నిలిచిపోతోంది. ఆ సమయంలో కుంగిన గుంతలు కనిపించక చాలామంది ద్విచక్ర వాహనదారులు అందులో పడిపోతున్నారు. గాయపడిన వారు పదుల సంఖ్యలో ఉన్నారు. ఈ దారిలో క్యాచ్‌ఫీట్లు, డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు కుంగి దాదాపు నాలుగు నెలలు గడుస్తున్నా సంబంధిత అధికారులు కనీస మాత్రంగానైనా స్పందించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటు న్యూ సీఐబీ క్వార్టర్స్ ప్రధాన వీధిలోని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పాత నివాసం ఎదుట ఉన్న డ్రైనేజీ మ్యాన్‌హోల్ కుంగిపోయి నెలకు పైగా గడుస్తోంది. దీని పక్కనే ఉన్న మరో డ్రైనేజీ తరచూ పొంగుతూ రోడ్డుపై మురుగు పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇక ఇందిరానగర్ వెళ్లే దారిలో దత్తాత్రేయ హెయిర్ సెలూన్ ముందున్న డ్రైనేజీ, క్యాచ్‌ఫీట్లు కిందకు కుంగిపోయాయి. ఇక్కడ ఇటీవలే మరమ్మతులు చేసినా అప్పుడే కుంగిపోయాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రీనివాస నగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో కుంగిన క్యాచ్‌ఫీట్లు, డ్రైనేజీల కప్పులకు మరమ్మతులు చేసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేయాల్సిన అవసరమెంతైనా ఉన్నది.

బీజేపీ గెలుపే లక్ష్యంగా కృషి

● ఎంపీ రఘునందన్ రావు


ఎర్రగడ్డలో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

ఎర్రగడ్డ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు మెదక్ ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. శుక్రవారం ఎర్రగడ్డ డివిజన్ సారథి నగర్‌లో బోరబండ, ఎర్రగడ్డ డివిజన్లకు సంబంధించిన పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు పార్టీ అభ్యర్థిని గెలిపించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. ప్రజల్లోకి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్యామ్‌సుందర్‌గౌడ్, సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకాల దీపక్ రెడ్డి, కార్పొరేటర్లు సుచిత్ర, సరళ, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, నాయకులు ప్రేమ్ కుమార్, రాజశేఖర్, అట్లూరి రామకృష్ణ, డివిజన్ అధ్యక్షుడు బొట్టు విజయకుమార్ పాల్గొన్నారు.


బాబాఫసియుద్దీన్ నివాసంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి

కాంగ్రెస్ అభ్యర్థికి భారీ మెజార్టీ తేవాలి

బోరబండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థికి బోరబండ డివిజన్ నుంచి అత్యధిక మెజార్టీ తేవాలని రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, గడ్డం వివేక్ వెంకటస్వామి కోరారు. బోరబండ సైట్-1 కాలనీలోని కార్పొరేటర్ ఎం.డి.బాబాఫసియుద్దీన్ నివాసంలో ఏఐసీసీ కార్యదర్శి పెరుమాళ్ విశ్వనాథన్, ట్రిమిస్ చైర్మన్ ఫహీంఖురేషితో కలిసి ఉప ఎన్నికపై శుక్రవారం వారు చర్చించారు. దాదాపు 45 వేల ఓట్లున్న బోరబండ డివిజన్‌లో కాంగ్రెస్ అభ్యర్థికి అత్యధిక మెజార్టీ వచ్చేలా చూస్తానని కార్పొరేటర్ ఫసియుద్దీన్ తెలిపారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

వెంగళరావునగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి.నవీన్ యాదవ్ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఏఐసీసీ కార్యదర్శి పి.విశ్వనాథన్ పిలుపునిచ్చారు. శుక్రవారం మధురానగర్‌లోని శ్రీ సాగి రామకృష్ణంరాజు కమ్యూనిటీ హాల్‌లో పది బూత్ కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. పార్టీ అభ్యర్థి వి.నవీన్ యాదవ్, కార్పొరేషన్ చైర్మన్‌లు జంగా రాఘవరెడ్డి, అవినాష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ పలు సూచనలు చేశారు. పార్టీ అధిష్టానం నిర్ణయాలకు లోబడి అందరూ పనిచేయాలని జంగా రాఘవరెడ్డి అన్నారు. పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నాయకులు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు కేశవరావు, మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని మర్యాద పూర్వకంగా కలిసిన జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్

● బంజారాహిల్స్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి)


దివంగత సీఎల్పీ నేత పీజేఆర్ లోకల్ కాదంటూ జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి వి.నవీన్ యాదవ్ పేర్కొనడంపై బీఆర్‌ఎస్ నేతలు నిరసన తెలిపారు. శ్రీరామ్‌నగర్ కూడలిలో పీజేఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నవీన్ యాదవ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు

● బోరబండ, ఆంధ్రజ్యోతి

బీయూఎఫ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని నేనే

● ఐతగోని రాఘవేంద్రగౌడ్

పంజాగుట్ట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బీసీ యునైటెడ్ ఫ్రంట్(బీయూఎఫ్) పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని తానేనని, సరైన కారణాలు చెప్పకుండా తొలగించే అధికారం పార్టీ జాతీయ అధ్యక్షుడికి లేదని ఐతగోని రాఘవేంద్రగౌడ్ అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసు కే యాదవ్, కోశాధికారి విద్యారాణి, యూత్ వింగ్ అధ్యక్షుడు గోపీయాదవ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు పాలూరు రామకృష్ణయ్య తనను రాష్ట్ర అధ్యక్షుడిగా తొలగిస్తూ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించడాన్ని తప్పుబట్టారు. సమావేశంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పికిల్‌బాల్‌లోకి సినీ డైరెక్టర్ తరుణ్



తరుణ్‌కు జెర్సీ అందిస్తున్న కౌశిక్, ప్రియాంక

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ పికిల్‌బాల్ లీగ్‌లోని రాప్టర్స్ జట్టుకు ప్రముఖ సినీ దర్శకుడు తరుణ్ భాస్కర్ సహయజమానిగా వ్యవహరించనున్నాడు. తరుణ్ జట్టులో భాగమవడంపై రాప్టర్స్ యజమానులు కౌశిక్ మానేపల్లి, ప్రియాంకరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని తరుణ్ నివాసంలో అతడికి కౌశిక్, ప్రియాంక జెర్సీని బహూకరించారు. శనివారం నుంచి డిసెంబరు 13వ తేదీ వరకు ఈ లీగ్ జరగనుంది. ఇందులో రాప్టర్స్‌తో పాటు మరో 7 జట్లు బరిలోకి దిగుతున్నాయి.

ప్రిన్సిపాల్ క్రెడిట్ కార్డులు హ్యాక్..!

అమీర్‌పేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌నగర్‌లోని ఓ కళాశాల ప్రిన్సిపాల్‌కు చెందిన మూడు క్రెడిట్ కార్డులను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు ఆయా ఖాతాల నుంచి రూ.72,180 నగదు స్వాహా చేశారు. ఎస్ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ కళాశాలకు చెందిన మహిళా ప్రిన్సిపాల్ తన ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, ఆర్‌బీఎల్ క్రెడిట్ కార్డుల నుంచి నగదు గల్లంతైనట్టు గుర్తించారు. కార్డులను హ్యాక్ చేసిన అగంతకులు ఫ్లిప్‌కార్ట్‌లో బంగారు నాణాలు, గిఫ్ట్ కార్డులు కొనుగోలు చేశారు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

రాయదుర్గం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతపై విద్యార్థులు చిన్ననాటి నుంచే అవగాహన కలిగి ఉండాలని గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీసులు సూచించారు. శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు గచ్చిబౌలిలోని నాగార్జున హైస్కూల్‌లో ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, చట్టాలు పాటించడం, సిగ్నల్స్ ప్రాముఖ్యత, పాదచారులు దాటే మార్గాల వినియోగం, ట్రిపుల్ రైడింగ్ వంటి ప్రమాదకర చర్యలను నివారించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సచ్చిదానందస్వామితో మంత్రి కొండా సురేఖ, ఐఏఎస్ అధికారి శైలజ రామయ్యార్

వేద పాఠశాలల ఏర్పాటుకు సహకారం

● దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

పద్మారావునగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వేద పాఠశాలల ఏర్పాటు, అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం, దేవాదాయశాఖ వారి సౌజన్యంతో పద్మారావునగర్ స్కందగిరి శ్రీసుబ్రమన్యస్వామి వారి ఆలయ ప్రాంగణంలో శ్రీ జనార్ధనానంద సరస్వతి స్వామి సంస్కృతి ట్రస్ట్ రజతోత్సవ కార్యక్రమంలో భాగంగా 25వ తెలంగాణ వేద విద్వన్మహాసభలు అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారు. మూడవ రోజైన శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమానికి ముఖ్యఅతిదులుగా తెలంగాణ రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ప్రిన్సిపల్ సెక్రటరి, దేవాదాయశాఖ కమిషనర్ శైలజ రామయ్యార్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ ఈ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేదం, ధర్మశాస్త్రంపై అవగాహన కలిగిస్తూ వేద విద్యార్థులను వేద పండితులుగా తీర్చిదిద్దడం అభినందనీయమని అన్నారు. వేద విద్యకు వేద పాఠశాలల అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందజేస్తానని తెలిపారు. ఐఏఎస్ అధికారిణి శైలజ మాట్లాడుతూ వేద పాఠశాలల్లో సమస్యలను గుర్తించామని, త్వరలోనే యాదగిరిగుట్టలో కంచిపీఠం సహకారంతో వేద పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వరంగల్, వేములవాడ, బాసరలోని వేద పాఠశాలల అభివృద్ధికి ప్రణాళికను రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ తూములూరి సాయినాధశర్మ,ప్రధాన కార్యదర్శి పసుమర్తి బ్రహ్మానందశర్మ,రజతోత్సవ ఆహ్వాన సంఘం అధ్యక్షులు విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎల్‌వీ సుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శి చింతపల్లి సుబ్రమణ్యం, ఆలయ ట్రస్టీ కృష్ణన్ రాజమణిలు, వేద పండితులు, వేదవిద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యమ నేత మానవతారాయ్‌కి డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉద్యమ నేత మానవతారాయ్ ప్రతిష్టాత్మక ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. "మాజీ గవర్నర్, హైదరాబాద్ రాష్ట్ర మొట్ట మొదటి చిట్టచివరి ముఖ్యమంత్రి డాక్టర్ బూర్గుల రామకృష్ణారావు జీవితం-సాహిత్యం" అనే అశంపై తెలుగు శాఖకు సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి ఓయూ ఆయనకు డాక్టరేట్ ప్రకటించింది. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ప్రస్తుత వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిత్యానంద రావు సమక్షంలో పరిశోధన పూర్తి చేశారు. ఖమ్మం జిల్లా కల్లూరుకి చెందిన మానవతారాయ్ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు. హైకోర్టు న్యాయవాదుల సంఘంలో శాశ్వత సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు, న్యాయవాదులు, విద్యార్థులు, నిరుద్యోగులు, కాంగ్రెసు నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

క్రైం సమాచారం

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఊరు గానీ ఊరొచ్చిన ఓ వ్యక్తి నగరంలో ఉపాధి లేకపోవడంతో తీవ్ర మనస్తాపంతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన చర్లపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం ఒడిశాకు చెందిన సుశీల్ కుమార్ సాహూ (32) బతుకుదెరువు కోసం కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చి స్విగ్గిలో పనిచేస్తున్నాడు. చేసిన పనికి డబ్బు సరిపోక, తగిన ఉద్యోగం లేకపోవడంతో తీవ్ర మనస్థాపం చెందిన సాహూ శుక్రవారం చర్లపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో యశ్వంతపూర్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : రైలు కింద పడి ఓ గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బొల్లారం రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం బొల్లారం రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం మధ్యరాత్రి గుర్తు తెలియని 45 ఏళ్ల వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలియరాలేదని రైల్వే పోలీసులు తెలిపారు.

రైలు ఎక్కుతుండగా జారిపడి వ్యక్తి మృతి



రవి కాంత్

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : కదులుతున్న రైలు ఎక్కబోతున్న ఓ ప్రయాణికుడు ప్రమాదవశాత్తు కిందపడి తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న ఘటన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వర్ రావు తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్‌కు చెందిన రవికాంత్(38) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. విజవాడలో పెయింటర్ పని కోసమని శుక్రవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. విజయవాడ వైపు వెళ్లే రైలు కదులుతున్న సమయంలో రన్నింగ్‌లో ఎక్కబోతుండగా ప్రమాదశావత్తు రెండు బోగీల మధ్య కింద పడడంతో రెండు కాళ్లు తెగిపడ్డాయి. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అతడిని వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మరణించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్లపై మురుగు పరుగు!

● వాహనదారుల అవస్థలు
● సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి

పద్మారావునగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధి పద్మారావునగర్ అభినవనగర్‌లోని అంతర్గత రోడ్లలో కొన్ని రోజులుగా మురుగు ఏరులై పారుతుండటంతో స్థానిక ప్రజలు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దాంతో పాటుగా వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. స్థానిక ప్రజల ఫిర్యాదుతో సంబంధిత హైడ్రా, జలమండలి సిబ్బంది సమస్యను పరిష్కరించినప్పటికీ పునరావృతమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు ప్రవాహంతో పరిసరాలు దుర్గంధ భరితంగా మారాయని తెలిపారు. గాంధీ ఆస్పత్రి వెనుక ఉన్న ఓపెన్ నాలాలో వ్యర్థాలు, చెత్తాచెదారం వేస్తుండటంతో కాలనీలోని మురుగు కాల్వ మ్యాన్‌హోళ్లు నిండిపోయి, సమస్య జఠిలంగా మారుతోంది. కాల్వలో చెత్తా చెదారం చేరటంతో ప్రవాహానికి అడ్డు తగిలి, డ్రైనేజీ నీరు పొంగి రోడ్లపై పారుతోంది. గాంధీ ఆస్పత్రికి చెందిన ఓపెన్ నాలాలో పాడైపోయిన ఆస్పత్రి బెడ్స్, ఇతరత్రా వ్యర్థాలు వేయటం వల్ల నిరంతరం ఈ సమస్యను ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు ఆరోపించారు. ముషీరాబాద్ జలమండలి సిబ్బంది రెండు రోజులపాటు శ్రమించి, నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి, ప్రస్తుతానికి సమస్యను పరిష్కరించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యను నిశితంగా పరిశీలించి శాశ్వత పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని కోరుకుంటున్నారు.

వ్యర్థాలు వేయకుండా చూడాలి

గాంధీ ఆస్పత్రి వెనుక ఉన్న ఓపెన్ నాలాలో పాడైపోయిన బెడ్స్ ఇతరత్రా వ్యర్థాలను వేయటం వల్ల అభినవనగర్ కాలనీవాసులు మురుగు సమస్యను ఎదుర్కొంటున్నారు. దానితో పాటుగా శాంభవి అపార్టుమెంటు ఎదురుగా గల నాలాలోకి రోడ్డుపై పేరుకుపోయిన చెత్త చేరకుండా, ఓపెన్ నాలాలోకి వ్యర్థాలు వేయకుండా తగిన చర్యలు చేపట్టాలి.

- వై.సంజీవకుమార్, స్కై ఫౌండేషన్ అధ్యక్షులు

రోడ్లపై మురుగు నిలువకుండా చూడాలి

గాంధీ ఆస్పత్రి వెనుక ఉన్న ఓపెన్ నాలాలో ఓవర్‌ఫ్లో కారణంగా మురుగు రోడ్డు పక్కన నిలుస్తోంది. దీనివల్ల ఆ ప్రాంతం దుర్గంధ భరితంగా మారి వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు కాల్వలోని మురుగు రోడ్లపైకి రాకుండా చర్యలు చేపట్టాలి. సమస్యకు కారణమైన ఓపెన్ నాలాలో వ్యర్థాలు వేయకుండా చూడాలి.

- చంద్రపాల్‌రెడ్డి, అభినవనగర్ కాలనీ అధ్యక్షులు

పెండింగ్ పనులు పూర్తి చేయండి

మల్కాజిగిరి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాబోయే నెల రోజుల లోపు పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలని అభివృద్ధి పనులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మాత్రం చూస్తూ ఊరుకునేది లేదని మల్కాజిగిరి కార్పొరేటర్ ఉరపల్లి శ్రవణ్ హెచ్‌ఎండీఏ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజనీర్ రవీందర్ రెడ్డిని హెచ్‌ఎండీఏ కార్యాలయంలో కలిసి అభివృద్ధి పనుల నిర్లక్ష్యంపై నిలదీసిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో హెచ్‌ఎండీఏ అధికారులు డీఈ రామారావు, ఏఈ శివారెడ్డి, ప్రత్యేక ఆర్కిటెక్ బృందం సఫిల్‌గూడ చెరువుకు శుక్రవారం వచ్చారు. చెరువు వద్ద మురుగు నీటి శుద్ధీకరణ కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. మురుగునీటి శుద్ధీకరణకు డీపీఆర్ సిద్ధం చేసి పంపుతామని డీఈ రామారావు పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇంజనీరింగ్ పనులన్నీ నెలలోపు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. మురుగు నీటి శుద్ధి కోసం చేపడుతున్న పనులకు హెచ్‌ఎండీఏ అధికారులకు పూర్తి సహకారాన్ని అందించాలని జీహెచ్‌ఎంసీ ఈఈ లక్ష్మణ్‌ను, వాటర్‌బోర్డు జీఎం సునీల్ కుమార్ లను కోరారు. రాంకీ సంస్థతో సమన్వయలోపంతో చెరువులోని గుర్రపు డెక్క తీసివేత ఆలస్యం అవుతుందని గుర్రపుడెక్క తొలగింపు వేగవంతం చేయాలని ఈఈ లక్ష్మణ్‌ను కోరారు.

8వ వేతనసంఘం ప్రక్రియ వేగవంతం చేయాలి

చిలకలగూడ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీత భత్యాల సవరణకు ప్రకటించిన 8వ వేతనసంఘం ప్రక్రియ వేగవంతం చేసి అమలుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వేమెన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ద.మ.రైల్వే జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. సికింద్రాబాద్, రైల్ నిలయం ఎదుట శుక్రవారం నిర్వహించిన ధర్నాలో ఫెడరేషన్ జాయింట్ జనరల్ సెక్రటరీ పి.యుగంధర్ ప్రసంగిస్తూ 8వ వేతన సంఘం ప్రకటించి నెలలు గడుస్తున్న ఎటువంటి చర్యలు చేపట్టలేదని అన్నారు. సంఘం చైర్మన్, సభ్యులను వెంటనే నియమించాలని, ఢిల్లీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను మభ్యపెట్టేందుకు వేతన సంఘం నియామక ప్రకటన చేసారని తెలిపారు. పాత, కొత్త పెన్షనర్ల ప్రస్తావన వద్దని అర్హులైన వారందరికీ తగు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని, పెన్షన్ వ్యాలిడేషన్ బిల్లు రద్దు చేయాలని, పెన్షన్ కమ్యూటేషన్ 15 సంవత్సరాల నుంచి 12 సంవత్సరాలకి తగ్గించాలని, రైల్వే పెన్షనర్స్‌కి మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని, స్తంభింప చేసిన 18 నెలల కరువు భత్యం బకాయిలు విడుదల చేయాలని, సీనియర్ సిటిజన్స్‌కు రైలు ప్రయాణంలో రాయితీలు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవని కలిసి ప్రధానికి అందజేయాల్సిందిగా కోరుతూ వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర రావు. కె.ఎస్. స్వామి, బాబురావు, పూర్ణారావు తదితరులు పాల్గొన్నారు.



రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవకు వినతిపత్రం అందజేస్తున్న పీయూ గంధర్ తదితరులు

బౌద్ధనగర్‌లో ఉచిత వైద్యశిబిరం

బౌద్ధనగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్‌లో గంగపుత్ర సొసైటీ కార్యాలయంలో శుక్రవారం స్పందన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. చిలకలగూడ లైఫ్‌స్ప్రింగ్ మెటర్నిటీ ఆసుపత్రి వైద్యులు శిబిరం పాల్గొని జనరల్‌తో పాటు మహిళలకు వైద్య పరీక్షలను చేశారు. సుమారు నూటయాభైమంది మహిళలు పాల్గొని వివిధ వైద్య పరీక్షలను చేయించుకున్నారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. స్పందన స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు డాక్టర్ దేశబోయిన రఘు మాట్లాడుతూ ప్రతి మూడునెలలకొకసారి వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పేద, మధ్య తరగతి మహిళలు ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గంగపుత్రసంఘం సభ్యులు దామిన సదానంద్, వి.సుధాకర్, సునీల్, సంజీవ్, రమేష్, శివ, విశాల్‌తో పాటు వైద్యులు పాల్గొన్నారు.



బౌద్ధనగర్‌లో ఉచిత వైద్యశిబిరంలో పాల్గొన్న స్పందన స్వచ్ఛందసంస్థ సభ్యులు, వైద్యులు

ట్యాంక్‌బండ్‌పై ముచ్చర్ల విగ్రహం పెట్టాలి

● బీసీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సైదులు యాదవ్

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ముచ్చర్ల సత్యనారాయణ పోరాట పటిమను, చరిత్రను తెలంగాణ ప్రభుత్వం గుర్తించి ఆయన విగ్రహాన్ని ట్యాంక్ బండ్ మీద ఏర్పాటు చేయాలని బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సైదు లు యాదవ్ విజ్ఞప్తి చేశారు. తెలంగాణ వాగ్గేయకారుడు, వైతాళికుడు, తెలంగాణ భాండంగారం, కవి, రచయిత మాజీ మంత్రి ముచ్చర్ల సత్యనారాయణ 9వ వర్ధంతిని బీసీఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ తెలంగాణ ఆవశ్యకతను తెలిపిన గొప్ప ఉద్యమకారుడని, తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ఎండగట్టారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు పేర్ల బాలు, పొలిటికల్ జేఏసీ చైర్మన్ వలిగొండ నరసింహ, అంసా ఓయూ అధ్యక్షులు నామ సైదులు, టీఎన్‌బీవీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి రవి కుమార్, జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి : మర్రి

మల్కాజిగిరి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి నియోజకవర్గంలోని జీహెచ్‌ఎంసీ తదితర కార్యాలయాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి శక్తివంచనలేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర రెడ్డి ఉద్యోగులకు హామీ ఇచ్చారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీకి చెందిన పలువురు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎమ్మెల్యేను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి సమస్యలు పరిష్కరించాల్సిందిగా వినతి పత్రం అందజేశారు. సమాన పనికి సమాన జీతం, ఉద్యోగుల క్రమబద్ధీకరణ అంశాలపై వినతిపత్రం సమర్పించారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఈ అంశాన్ని పరిగణలోకి తీసుకుని అవసరమైన చర్యలు తీసుకుని ఉద్యోగులకు న్యాయం చేస్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎన్. జగదీష్‌గౌడ్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, శ్రీనివాస్‌గౌడ్, వెంకటరమణ, వెంకటేష్, శాస్త్రిలు పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్‌లో అగ్నిప్రమాదంపై పారిశుధ్య కార్మికులకు అవగాహన కల్పిస్తున్న ఆర్పీఎఫ్ పోలీసులు

అగ్నిప్రమాదంపై మాక్ డ్రిల్

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : రైల్వేస్టేషన్‌లో అగ్నిప్రమాదం సంభవించినప్పుడు అక్కడ విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు అప్రమత్తం ఉండాలని సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సరస్వత్ సూచించారు. శుక్రవారం రైల్వేస్టేషన్ ప్లాట్ ఫాం నంబరు 10 సమీపంలో అగ్నిప్రమాదంపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. రైల్వేస్టేషన్‌లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, స్టాళ్లలో పనిచేస్తున్న ఉద్యోగులు 120 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ ఎస్సై వెంకటరెడ్డి, శంకర్, ఎస్సై సుబ్బారావులతో పాటు ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



సీతాఫల్‌మండి ఆర్య సమాజంలో నిర్వహించిన మహిళల సదస్సులో మాట్లాడుతున్న ఏసీపీ ప్రసన్నలక్ష్మి

మహిళల్లో మనోధైర్యమే షీటీమ్ లక్ష్యం

● ఏసీపీ ప్రసన్నలక్ష్మి

బౌద్ధనగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సమాజంలో వేధింపుల నుంచి మహిళలను రక్షించటమే షీటీమ్ లక్ష్యమని నగర షీటీమ్ విభాగం ఏసీపీ ప్రసన్నలక్ష్మి అన్నారు. శుక్రవారం సీతాఫల్‌మండి ఆర్య సమాజం వైదిక్ పాఠశాల ఆడిటోరియంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళల్లో మనోధైర్యం నింపడటం, తల్లులు, పిల్లలు పౌష్టికాహారంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిర్వహించారు. ఈ సదస్సులో ఆమెతో పాటు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జే.స్వప్నలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ సమాజంలో మహిళలకు ఎదురయ్యే వేధింపులు, షీటీమ్‌లను ఆశ్రయించే విధానంపై ఏసీపీ అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్ స్వప్న మాట్లాడుతూ గర్భిణీలు తీసుకోవాల్సిన పౌష్టికాహార పద్ధతులను వివరించారు. పిల్లలకు టీకాలు వేయించటం, పరీక్షలు చేయించి భవిష్యత్తులో ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం తల్లులు, పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండడం కోసం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జ్యోతి, జాహ్నవి, హరిప్రియ, సంధ్య, తిరుమల, లక్ష్మీ, రేణుక, ఎన్‌ఐఎన్ సైంటిస్టు సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

సికింద్రాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం గాంధీ మెడికల్ కాలేజీ ఆవరణలో తెలంగాణ ప్రభుత్వ జూడా వైద్యుల ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించి, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఎంఈ డాక్టర్ నరేందర్ కుమార్, ఐఏఎస్ అధికారి జోంగ్తు, హెల్త్ కార్యదర్శి డాక్టర్ రాజీవ్, టీపీసీసీ డాక్టర్ మహేష్ కుమార్ టీజీఎంసీ లాలయ్య, విష్ణు, గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, జూడా అధ్యక్షుడు ఐజాక్ న్యూటన్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ అజయ్ కుమార్ గౌడ్‌లు పాల్గొన్నారు.

బీసీల ద్రోహి బీజేపీ : కాంపెల్లి శ్రీనివాస్

అడ్డగుట్ట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : బీసీల న్యాయబద్ధమైన 42 శాతం రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకుంటూ బీసీలకు ద్రోహం చేస్తుందని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపెల్లి శ్రీనివాస్ మండిపడ్డారు. శుక్రవారం అడ్డగుట్టలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల బిల్లుకు కట్టుబడి ఉన్నామంటూనే, కేంద్రంలో బీజేపీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించకుండా డ్రామాలాడుతుందన్నారు. ఆ పార్టీకి బీసీల పట్ల చిత్తశుద్ధి ఉన్నా బిల్లుకు తక్షణమే ఆమోదం తెలిపి రిజర్వేషన్ల పెంపును తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కొమురెల్లి బాబు, గౌరి నాగరాజు, పాకాల యాదగిరి, సత్యనారాయణ, కొండల్, శ్రీనివాస్, సుదర్శన్, నాగభూషణం, రమేష్‌లు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోళ్లు



మమతా స్వీట్ హౌస్ డౌన్‌లో | ఆవుల మందలో వద్ద దుస్థితి | ఆర్పీ రోడ్డు చిత్ర దర్గా | మెక్లోడ్ గూడ గ్రౌండ్ వద్ద దుస్థితి | మెక్లోడ్ గుడా వద్ద దుస్థితి

● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
● పట్టించుకోని అధికారులు
● సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

రాంగోపాల్‌పేట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారుల సమన్వయ లోపంతో రాంగోపాల్‌పేట్ డివిజన్ ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. వీరి నిర్లక్ష్యంతో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్ల మూతలు కుంగిపోయి, ధ్వంసమయ్యి ప్రమాదకరంగా మారాయి. దీనితో ఆయా రహదారుల్లో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనితో వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు స్థానికులు స్వచ్ఛందంగా చర్యలు తీసుకుంటున్నారు.

మమతా స్వీట్‌హౌస్ లేన్‌లో

పీజీ రోడ్డులోని మమతా స్వీట్ హౌస్ నుంచి నల్లగుట్ట వైపు వెళ్లే దారిలో గతంలో నల్లగుట్ట నాలాలోకి వర్షపు నీరు వెళ్లడానికి ఓ డ్రయిన్‌ను నిర్మించారు. కానీ నిర్వహణా లోపం వల్ల అది ధ్వంసమై వాహనాదారులకు ఇబ్బందికరంగా మారింది.

లాలాటెంపుల్ స్ట్రీట్‌లో

లాలా టెంపుల్ స్ట్రీట్‌లో పోచమ్మ ఆలయం వెళ్ళే దారిలో కూడా మ్యాన్‌హోళ్ల స్థితి దీనస్థితిలో ఉంది. అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోతుంది.

చిత్ర దర్గా వద్ద

రాష్ట్రపతి రోడ్డులోని చిత్రదర్గా వద్ద కరోనా సమయంలో వర్షపు నీరు సులభంగా వెళ్లడానికి స్ట్రామ్ వాటర్ డ్రైయిన్ నిర్మించారు. స్ట్రామ్ వాటర్ డ్రైయిన్ ఓ రెండు మూడు సంవత్సరాలు మంచిగా ఉన్నదో ఏమో ఎప్పుడు చూసిన దాని పైకప్పు కుంగిపోయి వాహనదారులకు ఇబ్బందులను కలుగచేస్తుంది.

సంవత్సరాల తరబడి బాధపడుతున్నాం

సంవత్సరాల తరబడి మ్యాన్‌హోల్ సమస్యతో సతమతవుతున్నాం. అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదు. రాత్రి సమయంలో మ్యాన్‌హోల్ గుంతల వల్ల ప్రమాదాల బారిన పడుతున్నాం. అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలి.

- వీజే సూర్య ప్రకాష్, సోమసుందరం వీధి నివాసి

విధులను సక్రమంగా నిర్వహించాలి

అధికారులు విధులను సక్రమంగా నిర్వహిస్తే ఇబ్బందులు ఉండవు. వారి నిర్లక్ష్యం వల్ల ప్రజలు, వాహనదారులు, అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా వారు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని ఆశిస్తున్నాం.

- ఎస్ఆర్‌కె ప్రసాద్, విశ్రాంత ఉపాధ్యాయుడు